క్లుప్తంగా

'సస్పెన్షన్ ఆర్డర్‌ను ఎత్తివేయాలి'

కాచిగూడ: అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్–సీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి శ్రావణ్‌కుమార్‌పై విధించిన సస్పెన్షన్ ఆర్డర్‌ను వెంటనే ఎత్తివేయాలని ఎన్ఎఫ్‌పీఈ పీ–4 తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రావు డిమాండ్ చేశారు. సస్పెన్షన్ ఓ వ్యక్తి మీద జరిగిన దాడి కాదని ఇది ఉద్యోగ సంఘం మీద చేసిన దాడి అని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ.. సర్కిల్ కో– ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27న సోమవారం దేశవ్యాప్తంగా నిర్వహించే ధర్నా, నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపట్టడంతో పాటు సమ్మెకు సైతం పిలుపునివ్వడంలో ఎన్ఎఫ్‌పీఈ యూనియన్ వెనకడుగు వేయదని ఆయన స్పష్టం చేశారు.

టెన్త్ ఇంగ్లిష్‌పై ఉచిత అవగాహన తరగతులు

నల్లకుంట: పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షపై విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టేందుకు ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు ఉచిత అవగాహన తరగతులు నిర్వహించనున్నట్లు 'వేగాస్ ద సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజీ' డైరెక్టర్ వివేక్ చంద్ర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నల్లకుంట శంకరమఠం రోడ్డులోని వేగాస్ ద సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజీలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు మొదటి బ్యాచ్ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు సెకండ్ బ్యాచ్ తరగతులు కొనసాగుతాయన్నారు. ఇందులో ఇంగ్లిష్ ప్రశ్న పత్రంలోని కఠినమైన అంశాలు, అనుమానాలను నివృత్తి చేస్తూ జీపీఏ 10 సాధించడంలో విద్యార్థులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తామన్నారు. సెక్షన్ల వారిగా ఎడిటింగ్ స్కిల్స్, మైండ్ మేనేజ్‌మెంట్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తామని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అలరించిన నాటక ఉత్సవాలు



చిక్కడపల్లి: ధాత్రి సంక్షేమ సంఘం, కళాంజలి ఆధ్వర్యంలో నిర్వహించిన నవవిధ నిర్విరామ సంగీత నృత్య జానపద, నాటకోత్సవాలు అలరించాయి. నటి, రచయిత్రి, నిర్వాహకురాలు శాంతాకుమారి ఆధ్వర్యంలో పురందరదాసు, అన్నమాచార్య కీర్తనలు, నృత్యప్రదర్శనలు, పద్య, సాంఘిక నాటక ప్రదర్శనలు, జానపద నృత్యాలు, డబ్బు విన్యాసం, కోలాటం, ఏకపాత్రాభినయం కార్యక్రమాలు జరిగాయి. వంశీ రామరాజు, ప్రణయ్‌కుమార్, లయన్ సత్యనారాయణ, నారా చంద్రబాబునాయుడు, కావూరి శ్రీనివాసరావు, గురుస్వామి సుబ్బారాయుడు, బాలగంగాధరరావు, రవళి రమేష్, వీఎస్, మూర్తి పాల్గొని కళాకారులను అభినందించి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

పర్యావరణ సంక్షోభం మానవాళికి సవాల్

ఉస్మానియా యూనివర్సిటీ: పర్యావరణ సంక్షోభం మానవాళి ముందున్న అతిపెద్ద సవాల్ అని పర్యావరణ వేత్త ప్రొ.పురుషోత్తమరెడ్డి అన్నారు. ఓయూ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఉన్నత విద్య, సుస్థిర అభివృద్ధి అనే అంశంపై మూడు రోజులు జరిగిన అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. సదస్సు కన్వీనర్ ప్రొ.చంద్రునాయక్ అధ్యక్షత వహించగా ప్రొ.పురుషోత్తమరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేయడంతో మానవ సమాజం సంక్షోభాన్ని ఎదుర్కొనుందన్నారు. మూడ్రోజుల సదస్సులో 187 పరిశోధన పత్రాలు సమర్పించగా ప్రిన్సిపల్ ప్రొ.గణేష్, డీన్ ప్రొ.స్టీవెన్‌సన్, దూరవిద్య డైరెక్టర్ ప్రొ.జీబీ రెడ్డి, అధ్యాపకులు చలమల వెంకటేశ్వర్లు, శ్రీలత, కృష్ణకుమార్ పాల్గొని ప్రసంగించారు.

రాష్ట్రంలో రేషన్ కార్డు ఇవ్వలేని దుస్థితి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అడ్డగుట్ట: తెలంగాణ రాష్ట్రం అవినీతి అక్రమాలకు అడ్డాగా నిలిచిన రాష్ట్రంగా మారిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం రాత్రి తుకారాంగేట్‌లోని వెంకట్‌నగర్‌లో నిర్వహించిన శక్తి కేంద్రం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో అవినీతి, అక్రమాలు జోరుగా సాగుతున్నాయన్నారు. తెలంగాణ పేరును బీఆర్ఎస్‌గా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. తొమ్మిదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేని పరిస్థితిలో ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయాంలో ఇచ్చిన రేషన్ కార్డులే కాని, తెలంగాణలో ఇప్పటివరకు కూడా కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య భద్రత కార్డు రాకుండా కేసీఆర్ అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ బండకార్తీకరెడ్డి, నాయకులు సారంగపాణి, శ్యాం సుందర్, హరి, రాజశేఖర్, కన్నాభిరాం, హంసరాజ్, మహేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌మాస్టర్ సంతకం తప్పనిసరి



విన‌తిపత్రం అందజేస్తున్న ట్రస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.రెడ్డి

- మంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతి
- ఫొటో మార్ఫింగ్‌తో ఇతరులు పరీక్ష రాసే ప్రమాదం ఉందంటున్న ట్రస్మా

కవాడిగూడ: ఎస్ఎస్‌సీ–2023 ఏప్రిల్ పరీక్షల్లో హాల్ టికెట్లపై ప్రధానోపాధ్యాయుడి సంతకం లేకపోవడం వల్ల ఫొటో మార్ఫిడితో ఇతరులు పరీక్ష రాసే అవకాశం ఉందని హాల్ టికెట్లపై హెడ్‌మాస్టర్ సంతకం తప్పనిసరి చేయాలని 'తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్' (ట్రస్మా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విద్యా శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మట్లాడుతూ.. కొన్ని అనివార్య కారణాల వల్ల రాష్ట్రంలోని దాదాపు 100 పాఠశాలలో 'ఎక్స్‌టెన్షన్ టెంపరరీ రికగ్నైజేషన్' (ఈటీఆర్) పెండింగ్‌లో ఉన్నందున వారికి హాల్ టికెట్లను నిరాకరించారన్నారు. పాఠశాల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని హాల్ టికెట్లను అందించాలని మంత్రి సబితాఇంద్రారెడ్డికి విన్నవించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఈ విషయాన్ని తప్పకుండా పరిశీలిస్తామన్నారు. విద్యార్థులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.అనిల్‌కుమార్, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు రాఘవ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నారాయణ రెడ్డి, హైదరాబాద్ కార్యదర్శి రంగాచారి, జయరామ్‌ప్రసాద్, బుచ్చిరెడ్డి, రాములు, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


సినీనటి సబితకు కె. విశ్వనాథ్, శారద ప్రతిభా పురస్కారం



పురస్కారాన్ని అందజేస్తున్న రామరాజు, శారద, త్రినాథరావు

చిక్కడపల్లి: విశ్వనాథ్ సినిమాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటాయని వంశీ ఆర్ట్ థియేటర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు డాక్టర్ వంశీరామరాజు పేర్కొన్నారు. శనివారం సప్తపది సినిమా హీరోయిన్ భమిడిపాటు సబితకు కళాతపస్వి కె.విశ్వనాథ్–శారద ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేశారు. డాక్టర్ రామరాజు మాట్లాడుతూ.. విశ్వనాథ్ సినిమాలు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించి కాపాడేలా ఉంటాయన్నారు. ఆ రోజుల్లో ఆయన దర్శకత్వంలో వెలువడిన సప్తపది సినిమా తెలుగు ప్రజలను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. ఉగాది పర్వదిన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిర్వాహకురాలు, గాయని శారద, ఎస్‌బీఐ మాజీ ఏజీఎం త్రినాథరావు, మహేష్ తదితరులున్నారు.

పీసీ ఆదిత్యకు పంచాంగం అందజేత



నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు దాదా పాల్కే పురస్కార గ్రహీత చంద్ర ఆదిత్య (పీసీ.ఆదిత్య)ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీబీఎస్ఎస్ ఆధ్వర్యంలో నూతన పంచాంగాన్ని ఆయనకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. బ్రాహ్మణ అభ్యున్నతి కోసం టీబీఎస్ఎస్ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో బ్రాహ్మణ కళాకారులకు అవకాశం కల్పిస్తానన్నారు.

రమాదేవికి డాక్టరేట్ ప్రదానం



ఇడికూడ రమాదేవి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగంలో 'మహాభారతం–వ్యక్తిత్వ వికాసం' అనే అంశంపై పరిశోధనలు చేసి సమర్పించినందుకు రమాదేవికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. యూజీసీ సెట్‌లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు ఆమె అర్హత సాధించి, 2016లో ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ వారిజారాణి పర్యవేక్షణలో పీహెచ్‌డీలో చేరారు. పరిశోధనలో కొనసాగుతూనే 2018లో గురుకుల టీజీటీ, 2019లో లాంగ్వేజ్ పండిట్, గురుకుల డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా ఉద్యోగాలను సాధించారు. ప్రస్తుతం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల భువనగిరిలో తెలుగు అధ్యాపకురాలిగా ఆమె పని చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం రైతులకు తక్షణమే సాయం ప్రకటించాలి



మాట్లాడుతున్న ఏఐకేఎఫ్ ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అకాల వడగళ్ల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిహారాన్ని ప్రకటించాలని అఖిల భారత రైతు సమాఖ్య(ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేలతో సరిపెట్టకుండా ఉచిత ఎరువులు, విత్తనాలు అందించి పంట రుణాలను మాఫీ చేయాలన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వడగళ్ల వానలు రైతులకు తీరని ఆవేదనను మిగిల్చాయన్నారు. సీఎం కేసీఆర్ కొన్ని ప్రాంతాల్లోనే పర్యటించి ఎకరాకు పది వేల సాయం అందిస్తామని ప్రకటించి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

- వాస్తవానికి రాష్ట్రంలో పంటల బీమా పథకం అమలై ఉంటే రైతులకు జరిగే నష్టం మొత్తం బీమా రూపంలో వచ్చేదన్నారు. ఏఐకేఎఫ్ అధ్యక్షుడు మట్టయ్య, సహాయ కార్యదర్శి కృష్ణారెడ్డి, కన్వీనర్ తుకారాంనాయక్, కొమురయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహిస్తాం

అంబర్‌పేట: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహిస్తామని నారాయణ పాఠశాలల జీఎం గోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం డీడీ కాలనీలోని పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం మాస్టర్ ఓరియంట్ పేరిట పలు అంశాల్లో పోటీలను నిర్వహించారు. చిన్నారులు క్విజ్, ఫజిల్స్ వంటి అంశాల్లో తమ ప్రతిభను కనబరచగా.. వారిని డీజీఎం గోపాల్‌రెడ్డి అభినందించారు. ఏజీఎం బాల పరమేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ మానీస్టాలిన్, వైస్ ప్రిన్సిపాల్ సుజాత, కో– ఆర్డినేటర్స్ లక్ష్మీభవాని, ఆజాద్, నూర్జాహాన్, ఏఓ మల్లికార్జున్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఆయుష్మాన్ భారత్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్

కాచిగూడ: పేద ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ సూచించారు. ఆయుష్మాన్ భారత్ కార్డు పొందిన వారు ఏ ప్రైవేట్ ఆసుపత్రిలోనైనా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు పొందవచ్చన్నారు. కాచిగూడ, మోతీలాల్ నెహ్రూనగర్ కమ్యూనిటీహాల్‌లో ఆయుష్మాన్ భారత్ దరఖాస్తుల కేంద్రాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ప్రతీ పేద కుటుంబం వైద్య సేవలు పొందేలా ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. నాగరాజు, రామచంద్రారెడ్డి, గోకుల్, భీంరాజ్, రవియాదవ్, లావణ్య, సుజాత, శాంతాబాయి, వాసు, రామకృష్ణ, బాలప్రసాద్, దినేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి శోభాయాత్రకు ఆహ్వానం



మాజీ ఎంపీ వీహెచ్‌కు ఆహ్వానాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: శ్రీరామనవమి శోభాయాత్రకు హాజరు కావాలని మాజీ ఎంపీ వీ.హనుమంతరావుకు శోభాయాత్ర అంబర్‌పేట నియోజకవర్గ కన్వీనర్ వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డిలు ఆహ్వానం అందజేశారు. శనివారం డీడీ కాలనీలోని ఆయన నివాసంలో కలిసి శోభాయాత్ర వివరాలను తెలియజేశారు. ఈ నెల 30న అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్ నుంచి రామ్‌కోఠిలోని హనుమాన్ వ్యాయామశాల వరకు శోభాయాత్ర చేపట్టనున్నట్లు వివరించారు. బీజేపీ నాయకులు బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆర్.లక్ష్మణ్‌యాదవ్ తదితరులున్నారు.

'ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలి'



సదస్సులో పాల్గొన్న మాజీ ఎంపీ వివేక్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రైవేటు రంగ సంస్థల్లో విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని మాజీ ఎంపీ వివేక్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాల మహానాడు రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని మూతపడ్డ ప్రభుత్వ రంగ పరిశ్రమలను తెరిపించి కార్మికులకు ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. దళితుల సమగ్ర అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించే విషయంలో తీసే కంపెనీల్లో దళిత సామాజిక వర్గానికి చెందిన వారికి అవకాశాలు కల్పిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూమి కేటాయింపులో పూర్తిగా విఫలమైందన్నారు. మాజీ మంత్రి దేవయ్య మాట్లాడుతూ.. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల సాధనకు ఐక్య పోరాటాలు అవసరమన్నారు. శాసన సభ, పార్లమెంటులో ఈ అంశంపై రాజకీయాలకు అతీతంగా చర్చ జరగాలని ఆకాంక్షించారు. ఎస్సీ, ఎస్టీ, బ్యాక్లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని నగరంలో నిర్మిస్తున్న అంబేద్కర్ విగ్రహం పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. మాల సంక్షేమ భవన నిర్మాణం కోసం ఐదెకరాల భూమి, రూ.10 కోట్లు కేటాయించాలన్నారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హస్సేన్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, ప్రధాన కార్యదర్శులు మంచాల వెంకటస్వామి, జ్యోతిరావు, నేతలు పాశ్వాన్, బొమ్మగాని ప్రభాకర్, రాములు తదితరులున్నారు.

మహిళ ప్రాణాలు కాపాడిన డయల్ 100

అంబర్‌పేట: డయల్ 100 ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ మహిళను కాపాడింది. ఉరేసుకుని కొన ప్రాణాలతో ఉన్న ఆమె ప్రాణాన్ని నిలబెట్టింది. ఈ ఘటన శనివారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అడిషనల్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్ మల్లేష్, నీలిమ(55) దంపతులకు ఇద్దరు సంతానం. కాగా గత కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో ఇబ్బంది పడుతోంది. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంట్లో కుమారుడు భోజనం చేస్తుండగా నీలిమ పక్క గదిలోకి వెళ్లి చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. కొద్దిసేపటికి అనుమానం వచ్చిన కుమారుడు వెళ్లేసరికి పక్కగది తలుపు గడియ వేసి ఉండటంతో 100కు డయల్ చేశాడు. సమాచారం అందుకున్న కానిస్టేబుల్ రాజు, హోంగార్డు పుల్లయ్య ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్టు సమాచారం. సానుకూలంగా స్పందించిన పోలీసులను ఉన్నతాధికారులు ఈ సందర్భంగా అభినందించారు.

గృహిణి అదృశ్యం



విజయలక్ష్మి (ఫైల్)

అంబర్‌పేట: భర్తతో గొడవపడి ఇంట్లో నుంచి ఓ గృహిణి వెళ్లిపోయిన ఘటన అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లో నివసించే సంతోష్‌శ్రీరామ్ భార్య విజయలక్ష్మి (35) ఈ నెల 24న భర్తతో గొడవ పడింది. కాగా ఈ విషయమై ఆమె మనస్తాపంతో అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భర్త వెతికినా ప్రయోజనం లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



డీవైఎఫ్ఐ సదస్సులో మాట్లాడుతున్న తమ్మారెడ్డి భరద్వాజ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రముఖ సినీ దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. శనివారం సాయంత్రం సుందర య్యవిజ్ఞానకేంద్రంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా యువజనోత్సవ ముగింపు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సినీ రంగంతో పాటు ప్రధానంగా యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని ఇది సమాజానికి సరైంది కాదన్నారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో 'సే టూ నో డ్రగ్స్' అనే నినాదాన్ని యువతలోకి మరింతగా తీసుకెళ్లి చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి సమాజం ఎటుపోతుందో అర్థం చేసుకోలేని పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సినీ దర్శకులు కాశీవిశ్వనాథ్, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి జావేద్, సినీ డైరెక్టర్ బాబ్జీ, ప్రేమ్‌రాజ్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి విజయానంద్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి అశోక్‌రెడ్డి, డీవైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు మహేందర్, విజయ్‌కుమార్ తదితరులున్నారు.

నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడటం సరికాదు

నిరుద్యోగ మహాధర్నాకు తరలిన బీజేపీ నేతలు




కాచిగూడ: టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రాల లీకేజీపై నిరుద్యోగులకు మద్దతుగా బీజేపీ పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ఇందిరాపార్కు వద్ద జరిగిన నిరుద్యోగ మహాధర్నాకు బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి ఆధ్వర్యంలో కాచిగూడ నుంచి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి మహాధర్నాలో పాల్గొన్నారు. నిరుద్యోగులకు అండగా బీజేపీ పార్టీ ఉంటుందని ఆమె తెలిపారు. టీఎస్‌పీఎస్‌సీ ద్వారా జరిగిన పరీక్షలు లీక్ అయినందున ప్రతీ దరఖాస్తు దారునికి లక్ష రూపాయల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిట్టింగ్ జడ్జి ద్వారా విచారణ చేపట్టాలని అన్నారు.

అంబర్‌పేట: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీని నిరసిస్తూ బీజేపీ చేపట్టిన ధర్నాకు అంబర్‌పేట నియోజకవర్గం నుంచి ఆ పార్టీ నేతలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. శనివారం ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి ఆ పార్టీ నేతలు తరలివెళ్లారు. బీజేపీ నేతలు శ్యామ్‌రాజ్, వనం రమేష్, నాగభూషణంచారీ, ఆనంద్‌గౌడ్, యశ్వంత్, మైలారం రాజు, జ్యోతి, సరోజిని తదితరులున్నారు.


ధర్నాకు మద్దతుగా బైక్ ర్యాలీ..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. ఇందిరాపార్కు వద్ద బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నిర్వహించిన ధర్నాకు మద్దతుగా శనివారం రాంనగర్ డివిజన్ బీజేపీ నాయకులు బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు నుంచి ఇందిరాపార్కు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని బీజేవైఎం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు భరత్‌గౌడ్ ప్రారంభించారు. బీజేపీ నాయకులు కిరణ్, మంగళ, గోపి తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి: నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడడం సబబుకాదని నగర బీజేవైఎం మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రాల లీకేజీని నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద చేపట్టిన నిరుద్యోగ మహాధర్నాకు ఆ పార్టీ శ్రేణులు, నిరుద్యోగులు భారీగా తరలివెళ్లారు. గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగుల భవిష్యత్తును పరీక్ష పేపర్ లీకేజీలతో కాలరాస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దింపుతామన్నారు. టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రాల లీకేజీతో సంబంధం ఉన్న వారిని కఠినంగా శిక్షించేంత వరకు బీజేపీ పోరాటం చేస్తోందన్నారు. బీజేపీ నాయకులు ఆకుల సురేందర్, నవీన్‌కుమార్, నర్సింహ, సాయికుమార్, యాదగిరి, యువమోర్చా నాయకులు బుర్ర రాజ్‌కుమార్, శక్తిసింగ్, ఆనంద్‌రావు, అరుణ్‌కుమార్, లడ్డు, ఆకుల అభిషేక్, దీపక్ పాల్గొన్నారు.



ధర్నాలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితో ఆ పార్టీ ముఖ్య నేతలు



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న గుండగోని భరత్‌గౌడ్

రాహుల్‌గాంధీ అనర్హత వేటుపై కాంగ్రెస్ నిరసన



ముషీరాబాద్ చౌరస్తాలో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై ఎంపీ అనర్హత వేటు అప్రజాస్వామికమని యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. శనివారం ముషీరాబాద్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ముషీరాబాద్ చౌరస్తాలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అన్యాయాలపై ప్రశ్నించే గొంతుకలను అణచివేసే ధోరణితో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, గ్రేటర్ ఉపాధ్యక్షుడు పాశం అనిల్‌కుమార్‌యాదవ్, మేడి సురేష్‌కుమార్, టీపీసీసీ కార్యదర్శి రుషికేశ్వర్, గ్రేటర్ ఉపాధ్యక్షులు లింగంగుప్తా, అభిషేక్ కెనెడీ, కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్ కల్పనాయాదవ్, నాయకులు గుర్రం శంకర్, ఆర్.ఎల్.రమేష్, మురళీమోజెస్ తదితరులున్నారు.

పార్శీగుట్ట చౌరస్తాలో..

ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు ఆధ్వర్యంలో పార్శీగుట్ట చౌరస్తాలో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. రాహుల్ గాంధీపై ప్రజలపై విశ్వాసం పెరగడంతో ఓర్వలేకే కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజు, శ్రీకాంత్, బాలు తదితరులున్నారు.

ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధింపులు సరికాదు..

కవాడిగూడ: ప్రతి పక్ష నాయకులపై ప్రధాని మోదీ కక్ష సాధింపు ధోరణులకు పాల్పడుతున్నారని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి నల్లవెల్లి అంజిరెడ్డి ఆరోపించారు. రాజా డిలక్స్ చౌరస్తా వద్ద నిరసన ర్యాలీ నిర్వహించి రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్‌కు లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక రాహుల్‌గాంధీపై అక్రమ కేసులు బనాయిస్తూ.. ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రామకృష్ణ, జగన్, ప్రసాద్, విజయరావు, రామానందరెడ్డి, వై.పీ.రాజు, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కుట్రే..

- రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం రాజకీయ కుట్రలో భాగమేనని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. దేశంలోని పౌరులు ప్రజాస్వామ్య వాదులు రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నారన్నారు. శనివారం కవాడిగూడలోని న్యాయవాదుల జేఏసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్టికల్ 102, 103 ప్రకారం అనర్హత వేటు వేయవచ్చని కేంద్ర ఎన్నికల కమిషన్ అభిప్రాయాన్ని కోరిన తర్వాత రాష్ట్రపతి తుది నిర్ణయం తీసుకుంటారన్నారు.

ప్రశ్నించే గొంతు నొక్కడమే..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాహుల్‌గాంధీపై వేటు వేయడం అంటే ప్రశ్నించే గొంతును నొక్కే చర్య అని తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గారె వెంకటేష్‌మాదిగ విమర్శించారు. మోదీ ప్రభుత్వం దురహంకారానికి పరాకాష్ట అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని టీఎంపీఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడం దుర్మార్గమన్నారు. ప్రజల్లో రాహుల్‌గాంధీ పట్ల విశ్వాసం పెరుగుతుంటే అది చూసి జీర్ణించుకోలేని కేంద్ర ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి ప్రజలంతా ఐక్యం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. టీఎంపీఎస్ మీడియా ఇన్‌చార్జ్ మాదిరి నర్సింగ్‌రావు, అధికార ప్రతినిధి సాంబయ్య, ఉపాధ్యక్షులు మెరుగు వెంకన్న, బాబు, రమేష్, శ్రీను, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.